ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం





కోడుమూరులో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, వారితల్లిదండ్రులు, గడివేముల ఏపీ మోడల్ స్కూల్ సెంటర్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం, ఓర్వకల్లు జెడ్పీ హైస్కూల్‌లో పరీక్షకు హాజరైన విద్యార్థులు

కోడుమూరు రూరల్: విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు తొలిమెట్టుగా భావించే పదోతరగతి పరీక్షలు కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాల్లో ప్రారంభమయ్యాయి. తొలి రోజు అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కోడుమూరులోని బాలురు, బాలికల హైస్కూల్ ఏ,బి, మోడల్ స్కూల్‌తో పాటు, లద్దగిరి హైస్కూల్, గోరంట్ల రెసిడెన్సియల్ పాఠశాల కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన తెలుగు పరీక్షకు మొత్తం 1226 మంది విద్యార్థులకు గాను 1218మంది హాజరవ్వగా 8మంది గైర్హాజరైనట్లు కోడుమూరు ఎంఈఓ తైమూర్‌బాషా తెలిపారు.

గూడూరులో నలుగురు విద్యార్థులు గైర్హాజరు

గూడూరు మండలంలోని బాలురు, బాలికలు, జూలకల్ ఏపీ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రాల్లో జరిగిన పదవతరగతి తెలుగు పరీక్షకు 479 మంది విద్యార్థులకు గాను నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ సునీలమ్మ తెలిపారు.

కర్నూలు (రూరల్) : మండలంలో పదవ తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓలు వినోద్‌కుమార్, హనుమంతరావు తెలిపారు. ఉల్చాల, గార్గేయపురం, ఇ.తాండ్రపాడు, వసంత నగర్‌లలో పరీక్ష కేంద్రాల్లో మొత్తం 663 మందికి గాను 657 మంది హాజరై పరీక్షలు రాశారు.

సి బెళగల్: మండల కేంద్రంలోని సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్, మోడల్, గురుకుల పాఠశాలలతో పాటు కొత్తకోట జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాల్లో మొత్తం 1,337 మంది విద్యార్థుల్లో 12 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులు ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కాగా మండలంలో పరీక్షల నిర్వహణను కోడుమూరు హైస్కూల్ హెచ్ఎం తైమూర్, సీఎస్ డీటీ రమణ బృందం పరిశీలించింది. ఎస్ఐ తిమ్మారెడ్డి, ఎంఈఓ జ్యోతి పరీక్ష కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

పాణ్యం: పాణ్యం మండలంలోని ఆరు కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు అర గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. తనిఖీ చేసిన తర్వాత లోనికి అనుమతించారు. మొత్తం 1184 మంది విద్యార్థులకు గాను 1159 మంది హాజరయ్యారు. 25 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

గడివేములలో ఇద్దరు గైర్హాజరు

గడివేముల: మండల కేంద్రమైన గడివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 మంది, ఏపీ మోడల్ స్కూల్‌లో 207 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఎంఈఓలు మేరీ సునీత, రాజేంద్ర ప్రసాద్ తనిఖీ చేశారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో భద్రత ఏర్పాటు చేశారు.

ఓర్వకల్లు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు మొత్తం 932 మందికి గాను 925 మంది హాజరయ్యారు. కాల్వబుగ్గ గురుకుల పాఠశాల కేంద్రంలో 216 మందికి గాను 212 మంది, లొద్దిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 203 మందికి గాను 201 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అలాగే ఓర్వకల్లు జెడ్పీహెచ్ స్కూల్ కేంద్రంలో 220 మంది హాజరై వంద శాతం నమోదైంది. స్థానిక ఏపీ మోడల్ స్కూల్ కేంద్రంలో 184 మందికి 182 మంది, బాలభారతి హైస్కూల్ కేంద్రంలో 112మందికి 110 మంది విద్యార్థులు హాజరయ్యారు.

కల్లూరులో 24 మంది గైర్హాజరు

కల్లూరు: పది పబ్లిక్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓలు శ్రీనివాసులు, వనజ కుమారి తెలిపారు. కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో 18 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 3798 మంది విద్యార్థులకు గాను 3774 మంది హాజరయ్యారని వెల్లడించారు. 24 మంది గైర్హాజరైనట్లు చెప్పారు.



గార్గేయపురం పరీక్ష కేంద్రం వద్ద హాల్ టిక్కెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



సి.బెళగల్ కేంద్రం వద్ద ...



కోడుమూరులో దివ్యాంగుడైన కుమారుడిని పరీక్ష రాయించేందుకు ఎత్తుకెళుతున్న తండ్రి

క్లుప్తంగా

కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి



డ్రైనేజీ బాగా లేదని చూపిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 29వ వార్డులోని ఉద్యోగనగర్, వాసు నగర్, శారద నగర్ తదితర ప్రాంతాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయా ప్రాంతాల్లో సీపీఎం నాయకులు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. సీపీఎం నగర కమిటీ నాయకులు యేసు, హుస్సేన్ బాషా మాట్లాడుతూ.. ఉద్యోగనగర్, వాసు నగర్, శారద నగర్‌లలో రోడ్లు, డ్రైనేజీల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఆయా కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలన్నారు. నాయకులు సుబ్బారెడ్డి, హనుమన్న, రాముడు, హనీఫ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కోడుమూరు కోఆర్డినేటర్‌గా అనంతరత్నం



కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీ కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా అనంతరత్నం మాదిగను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆదేశాలు జారీ చేశారు. ఇంతవరకు కోడుమూరు ఇన్‌చార్జ్‌గా పి.మురళీకృష్ణ ఉండేవారు. ఆయనను తొలగించి అనంతరత్నం మాదిగను నియమించారు. ఈనేపథ్యంలో ఆయన కాంగ్రెస్‌పార్టీలో కొనసాగుతారో లేదో చూడాల్సి ఉంది.

ఫిజియోథెరపీతో కండరాలకు బలం



ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న వైద్యుడు వీరేష్

సి.బెళగల్: దివ్యాంగులు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయించుకుంటే కండరాలకు బలం చేకూరుతుందని ఫిజియోథెరపిస్ట్ వీరేష్ అన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో తొమ్మిది మంది దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ప్రతివారం ఉచితంగా నిర్వహించే ఈ క్యాంప్‌ను మండలంలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపిస్ట్ కోరారు.

చేతిపంపును బాగు చేయండి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట పని చేయని చేతిపంపు

కర్నూలు(రూరల్): నగరంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న చేతిపంపు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఈ కార్యాలయం వద్దే మహిళా పోలీస్ స్టేషన్, మహిళా సబ్‌జైలు, కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ మహిళ నృత్య కళాశాల ఉంది. వేసవి కాలం ప్రారంభం కావడంతో ఆయా కార్యాలయాల వద్దకు వచ్చే ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. చేతిపంపును బాగు చేస్తే మేలవుతుందని వారు కోరుతున్నారు.

మార్కెట్ యార్డులో చలి వేంద్రాల ఏర్పాటు

కర్నూలు(అగ్రికల్చర్): ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో చలివేంద్రాలు ఏర్పాటయ్యాయి. మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి వాటిని ప్రారంభించి మాట్లాడారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో కార్మికులు, రైతులు ఇతర అన్ని వర్గాల ప్రజల కోసం మూడు చలి వేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

పోక్సో యాక్ట్‌పై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పి.పాండురంగారెడ్డి

కర్నూలు సిటీ: నగర శివారులోని పంచలింగాల సమీపంలో ఉన్న ప్రభుత్వ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పోక్సో యాక్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరవ అదనపు జిల్లా జడ్జి పి.పాండురంగారెడ్డి మాట్లాడుతూ 2012 రక్షణ చట్టం ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. పోక్సో కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్టులు ఉన్నాయన్నారు.

ఉగాది క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను సోమవారం వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. క్యాలెండర్ సరళమైన భాషలో అందరికీ అర్థం అయ్యే విధంగా రూపొందించారన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కర్నూలు, కల్లూరు కమిటీ అధ్యక్షులు, సభ్యులు నాగయ్య, పురుషోత్తం, ఈశ్వరయ్య, అనిత, ఓబులేసు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్మించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నగర అభివృద్ధి కమిటీ సభ్యులు

కోడుమూరు రూరల్: గూడూరులో తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్మించాలని నగర అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు.సోమవారం వారు గూడూరు తహసీల్దార్ రామాంజినేయులును కలిసి వినతిపత్రం అందజేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ గూడూరులో తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ఖాళీ చేసి మండల పరిషత్ కార్యాలయం నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయ నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దండు సుందరరాజు, సుభాకర్, రామాంజినేయులు, రాజు, భాస్కర్, మనోహర్, మద్దిలేటి, మధు, సులేమాన్, అమ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



వీఓఏల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం రామేశ్వర్

సి.బెళగల్: ఉల్లాస్ కార్యక్రమం కింద మండలంలో నిరక్షరాస్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని వెలుగు ఏపీఎం రామేశ్వర్ అన్నారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో వీఓఏలతో ఉల్లాస్ కార్యక్రమం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ రాష్ట్ర సాక్షరతా మిషన్ అథారిటీ - వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో 10వ తరదగతి పాసైన పొదుపు గ్రూపు మహిళలతో నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమ నిర్వహణలో భాగంగా అభ్యసకుల వివరాలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. సీసీలు శ్రీనివాసులు, గుండమయ్య, మాదులు, మహబూబ్‌బాష, రాముడు, ఎంఎస్ అకౌంటెంట్ గోవిందు, వీఏఓలు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



ఉపవాసదీక్షపరులకు ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న హిందువులు

గడివేముల: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి అన్నారు. ఉపవాసం ఉన్న ముస్లింల కోసం గడివేముల శ్రీరాజరాజేశ్వరి హైస్కూల్ ఆవరణలో కరస్పాండెంట్ రామేశ్వరరావు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఇఫ్తార్ తినిపించి ఉపవాస దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. పాఠశాల హెచ్ఎం రాఘవేంద్రరావు, నాయకులు దేశం నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ జమాల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

కల్లూరు: మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జీవితాలు చిత్తు అవుతాయని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ మంజులరాణి అన్నారు. సోమవారం సల్కాపురం గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరమన్నారు. వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం సర్పంచ్ మద్దిలేటి, విద్యార్థినులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వద్దు- జీవితమే ముద్దు, మాదకద్రవ్యాల దుర్వినియోగం ఆపండి అంటూ విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు దేవేందర్‌రెడ్డి, డాక్టర్ మనోజ్ కుమార్, ఎన్ఎస్ఎస్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

-చిన్నటేకూరు సమీపంలోని సీఈఎస్ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చెట్లమల్లాపురం గ్రామంలో పర్యటించి ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు.



ర్యాలీ చేస్తున్న నర్సింగ్ కళాశాల విద్యార్థినులు

మద్యం దుకాణాన్ని తొలగించాలి

కర్నూలు: కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన పచ్చని పంట పొలాల మధ్య ఏర్పాటు చేసిన రేణుక ఎల్లమ్మ మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించి లైసెన్స్‌ను రద్దు చేయాలని సీపీఐ ప్రతినిధి బృందం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావుకు వినతిపత్రం సమర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు జగన్నాథం, కల్లూరు మండల నాయకులు శ్రీనివాసరావు, పుల్లన్న, దొడ్డిపాడు మహమ్మద్ బాషా తదితరులతో కూడిన ప్రతినిధి బృందం సోమ వారం అసిస్టెంట్ కమిషనర్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. సుమారు మూడు ఎకరాల స్థలంలో ఎల్లమ్మ వైన్స్ పేరుతో దుకాణం ఏర్పాటు చేసి ఎలాంటి సమయపాలన పాటించకుండా మద్యం విక్రయాలు జరుపుతున్నారని ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం మద్యం దుకాణంలో విక్రయా లు మాత్రమే జరపాల్సి ఉండగా, అక్కడే మద్యం తాగేందుకు బార్ అండ్ రెస్టారెంట్‌ను తలపించేలా ఏర్పాట్లు చేశారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

బైండోవర్ కేసులు నమోదు

కోడుమూరు రూరల్: ఇటీవల గూడూరులోని రహదారిపై కొందరు యువకులు పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటూ తల్వార్లతో ఫొటోలు దిగారు. తర్వాత వాటిని సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న కోడుమూరు సీఐ తబ్రేజ్ విచారణ జరిపి ఏడుగురు యువకులపై సోమవారం బైండోవర్ కేసులు నమోదు చేశారు. భవిష్యత్‌లో ఎవరైనా వ్యక్తులు ఇలాంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.

చురుగ్గా సీసీరోడ్ల పనులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలోని రెడ్డివాళ్ల వీధితో పాటు మాలబావి, శ్రీవాల్మీకి రామాలయం ప్రాంతాల్లో దాదాపు రూ.4 లక్షల అంచన వ్యయంతో రహదారుల పనులు జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీ నిధులతో జరుగుతున్న ఈ పనులను సోమవారం సర్పంచ్ పాండురంగన్న, ఇంజినీర్ అసిస్టెంట్ శ్రీరాములు పరిశీలించారు.

ఆదర్శ గ్రామాల్లో తనిఖీలు

సి.బెళగల్: మండలంలోని ఆదర్శ గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులను అధికారులు తనిఖీ చేశారు. గూడూరు మండల ఈఓఆర్డీ మధులత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సనా తమ సభ్యులతో కలిసి పోలకల్, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, కంబదహాల్ గ్రామాల్లో పర్యటించారు. ఎస్‌డబ్ల్యూఎం షెడ్లు, మురికి కాలువలు, మరుగుదొడ్లను పరిశీలించి నివేదిక తయారు చేసుకున్నారు. ఈ అధికారుల వెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి, వెంకటేష్, ముస్తాక్, ఇంజినీర్ అసిస్టెంట్లు మనోజ్‌కుమార్‌రెడ్డి, మధు, మాధురి, శ్రీరాములు ఉన్నారు.

అభివృద్ధి పనుల వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలి

సి.బెళగల్: గ్రామాల్లో జరిగే వివిధ అభివృద్ధి పనుల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని గ్రామ సచివాలయాల ఇంజినీర్ అసిస్టెంట్లకు ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు గోసేనాయక్, వెంకటప్రకాష్ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈలు ప్రభుత్వ అనుమతులు, నిధుల వివరాల పత్రాల తయారీ, నిధులు, ఖర్చులు ఎం బుక్కులలో నమోదుపై అవగాహన కల్పించారు.

హంద్రీ వెంట రోడ్డు నిర్మించాలి



ముజఫర్‌నగర్‌లో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: హంద్రీ కాలువ వెంట రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సాయిబాబా, కె. సుధాకరప్ప డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సోమవారం కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్‌లో పర్యటించారు. హంద్రీ కాలువలో విపరీతంగా కంపచెట్లు పెరిగాయని తెలిపారు. అసాంఘీక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. కాలనీలోని మురుగు కాలువలో చేరుతుండడం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని ముజఫర్‌నగర్‌లోని ఐఎంఎల్ డిపో నుంచి కల్లూరు హంద్రీ బ్రిడ్జి వరకు మురుగు కాలువ నిర్మించి రోడ్డు వేయాలన్నారు.

రోడ్డెక్కిన చేనేత కార్మికులు



కోడుమూరులో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న చేనేత కార్మికసంఘం నాయకులు

కోడుమూరు రూరల్: చేనేత రంగానికి కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో నామమాత్రంగా నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ సోమవారం నేతన్నలు రోడ్డెక్కారు. చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి మాట్లాడుతూ చేనేత రంగానికి బడ్జెట్‌లో 2 వేల కోట్లు కేటాయించాలని కూటమి ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కేవలం రూ.115 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చూస్తే చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసేలా ఉన్నాయన్నారు. గతంలో వైఎస్ జగన్ సర్కారు చేనేత కార్మికుల సంక్షేమం కోసం నెలకు రూ.2 వేల చొప్పున ఏడాదికి రూ.24వేలు అందించి ఆదుకుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పదినెలలైనా పైసా సాయం చేయలేదన్నారు. చేనేతలకు రూ.5లక్షల వరకు రుణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, జీఎస్టీ పూర్తి స్థాయి రద్దు తదితర ఎన్నికల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక చేనేత కార్మిక సంఘం నాయకులు లోకనాథ్, రాజు, విజయ్, మధు, వలి, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉల్చాలవాసుల సమస్యలు పరిష్కరించండి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఉల్చాల గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు ఎంపీడీవో జి.రఘునాథ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లడుతూ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వివిధ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దాదాపుగా 50 విద్యుత్ స్తంభాలకు రాత్రి సమయాల్లో లైట్లు వెలగడం లేదన్నారు.ఊరిలో రోడ్లు, కాలువలు సరిగా లేవన్నారు. మంచినీటి సమస్య వేధిస్తుందని చెప్పారు. అధికారులు స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండల నాయకులు అంజి, ప్రకాష్ ఉన్నారు.

పేదల ప్లాట్లకు నంబర్లు వేయాలి



పేదల ప్లాట్ల వద్ద ఆందోళనకు దిగిన సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో రెండో విడతలో పేదలకు ఇచ్చిన ప్లాట్లకు నంబర్లు వేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న కోరారు. సోమవారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా నన్నూరు గ్రామంలో పర్యటించారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల ప్లాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసి లేఅవుట్‌ల్లో ప్లాట్లు వేశారాన్నరు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ప్లాట్లకు నంబర్లు వేయకుండా వదిలేశారని తెలిపారు. ఎన్నికల తర్వాత అనేకసార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. మండల సర్వేయర్ ఈ నెల 17న నంబర్లు వేస్తామని చెప్పారని, లబ్ధిదారులు ప్లాట్ల వద్దకు వచ్చి ఎండలో ఎదురు చూశారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లకు నంబర్లు వేయకపోవడం అంతర్యమేమిటని ప్రశ్నించారు. సీపీఎం నాయకులు మధుసూదన్, శ్రీనివాసులు, వలి, మధు, బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు(సెంట్రల్): సీఎం కార్యాలయం నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దని, పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించా లని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి కలెక్టర్ .రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య వినతు లు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పత్తికొండ ఆర్‌డీఓ దగ్గర 10, ఆదోని సబ్ కలెక్టర్ దగ్గర 16, కర్నూలు ఆర్‌డీఓ దగ్గర 15, డీఎస్ఓ దగ్గర 3, సర్వే ఏడీ 2, డీఆర్‌డీఏ పీడీ2, జిల్లా పరిషత్ సీఈఓ, డీఎంహెచ్, డీపీఓ, గిరిజన సంక్షేమ శాఖ, పీసీబీ, జిల్లా రిజిస్ట్రార్, హౌసింగ్ పీడీల దగ్గర ఒక్కో అర్జీ పెండింగ్‌లో ఉందని వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల అర్జీల పరిష్కారాన్ని కూడా వేగవంతం చేయాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. కృష్ణగిరి తహసీల్దార్ వద్ద 43, కర్నూలు ఆర్‌డీఓ 37, పత్తికొండ ఆర్‌డీఓ 12, ఓర్వకల్ తహసీల్దార్ 9, మిగిలిన మండలాల్లో కూడా సింగిల్ డిజిట్‌లో అర్జీలు పెండింగ్‌లో ఉన్నా యని చెప్పారు. కాగా, సచివాలయాల ద్వారా జరిగే వివిధ రకాల సర్వేలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బీకే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.